క్లుప్తంగా

యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి



ఈశ్వరరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని పాలక మండలి సభ్యునిగా ఎన్నికైన నరాల ఈశ్వరరెడ్డికి గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. ఆదివారం ఈశ్వరరెడ్డి మార్కాపురంలోని ఎమ్మెల్యే అన్నా రాంబాబు నివాసానికి వచ్చి సన్మానించారు. తనకు పాలకమండలి సభ్యునిగా అవకాశం కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంభం వాసవీ విద్యాసంస్థల అధినేత జి.రత్నంబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్

గిద్దలూరు రూరల్: బాలబాలికలకు ఈ నెల 12, 13వ తేదీల్లో స్కూల్ గేమ్స్ సెలక్షన్ నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ జి.శోభన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. 12వ తేదీన ఉదయం 9.30 గంటలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పీడీలు, పీఈటీలు తమ టీమ్‌లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9618801191ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1979–80లో పదో తరగతి చదివిన విద్యార్థులు 4 సీలింగ్ ఫ్యాన్లు, 10 కూలింగ్ వాటర్ క్యాన్లు హెచ్‌ఎం సుధాకర్‌కు ఆదివారం అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. దాతల సాయంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పూర్వవిద్యార్థులు ఆకాంక్షించారు.


బాధ్యతలు స్వీకరించిన కంభం ఎస్సై



ఎస్సై పులిరాజేష్

కంభం: కంభం ఎస్సైగా పులి రాజేష్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరావు అర్ధవీడుకు బదిలీ అయిన నేపథ్యంలో ఆయన స్థానంలో పెద్దారవీడు ఎస్సైగా పనిచేస్తున్న పులి రాజేష్‌ను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నూతన ఎస్సైని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

గిద్దలూరు రూరల్: వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ కోరారు. పట్టణంలోని వీఆర్ గ్రాండ్ హోటల్ ప్రాంగణంలో ఐఎంఏ గిద్దలూరు శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రంలో 98వ శాఖను గిద్దలూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో వైద్యశాలలపై దాడులు, వైద్యులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యులు, వైద్యశాలలపై దాడుల నిరోధకానికి చట్టం తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కిషోర్, కార్యదర్శి డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జయశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, ఒంగోలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జాలాది మణిబాబు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేకూరితేనే ఆశీర్వదించండి

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: 'అర్హులందరికీ నవరత్న పథకాలను వర్తింపజేశాం.. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. మీకు మేలు జరిగితేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి' అని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గుడిమెట్ట సచివాలయం పరిధిలోని రామాపురం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగరెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాలు అమలులో భాగంగా ప్రతి ఇంటికీ అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ వాహన మిత్ర.. ఇలా ఏదో ఒక సంక్షేమ పథకంతో లబ్ధి చేకూరుస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. చెల్లని చెక్కులను చేతిలో పెట్టారని, పసుపు కుంకుమ అంటూ మోసగించారని దుయ్యబట్టారు. రామాపురం గ్రామంలో ప్రతి గడపకూ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించారు. పలువురు గ్రామస్తులు సమస్యలు తెలియజేయగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ, గుడిమెట్ట, పాలకవీడు, కంచిపల్లె సర్పంచులు రెడ్డికాశిరెడ్డి, షేక్.పల్నాటి లతీఫ్, వెంకట రాజమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, నాయకులు మదిరె నెమలిరెడ్డి, పగడాల శ్రీరంగం, అన్నపురెడ్డి శంకర్‌రెడ్డి, అన్నపురెడ్డి వెంకట నారాయణరెడ్డి, మదిరె గుండా రెడ్డి, సూర పాండురంగారెడ్డి, బద్దెటి ప్రవీణ్‌కుమార్, చిట్టెం మార్క్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని మడమ తిప్పని నేత సీఎం జగన్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చి మాట తప్పని.. మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోయారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం పొదిలి మండలం కంభాలపాడు సచివాలయం పరిధిలోని పోతవరం ఎస్సీ కాలనీ, అడ్డరోడ్డు, సాయి బాలాజీ నగర్, అచ్చినగర్‌లో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గడప గడపకు వచ్చిన అధికారులు, నాయకులకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ 99 శాతం నేరవేర్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డానియల్‌జోసఫ్, మర్రిపూడి, కొనకనమిట్ల ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, ఎం మురళీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, మోరా శంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మల్లాపురం నరసింహులు, జూపల్లి ఏడుకొండలు, మందలపు శ్రీనివాసరెడ్డి, గుంటూరి పిచ్చిరెడ్డి, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, అనుబంధ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాట పాదయాత్ర



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు

దొనకొండ: జిల్లా అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు కేటాయించాలని, వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలని సీపీఎం వక్తలు పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేటి నుండి 14 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోరుబాట యాత్ర జరుగుతుందని జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన దొనకొండలో పోరుబాట పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాజీ రాజ్యసభ సభ్యుడు, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు పాల్గొని పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. ప్రకాశం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదని మధు తెలిపారు. సీపీయం రాష్ట్ర నాయకుడు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ దొనకొండ ప్రాంతంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, పరిశ్రమలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాను సమగ్రాభివృద్ధికై సీపీయం పోరుబాట యాత్ర ప్రారంభించిందని ఆంజనేయులు అన్నారు. సీపీయం పార్టీ నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, తాండవ రంగారావు మాట్లాడిన వారిలో ఉన్నారు. పాదయాత్ర దొనకొండ నుంచి కొచ్చెర్లకోటకు వెళ్ళింది. నాయకులు చిరుపల్లి అంజయ్య, కర్నా హనుమయ్య, కదం శ్రీనివాసులు, కుందుర్తి అనిల్, కిరణ్, చంటి, సంతోష్, గుడిమెట్ల ఆదాము, ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలి తల్లీ



ప్రత్యేక పూజలు అందుకుంటున్న పోలేరమ్మ దేవత

పుల్లలచెరువు: వానలు కురిసి పంటలు బాగా పండాలి తల్లీ అంటూ పుల్లలచెరువు లో గ్రామస్తులు గ్రామ దేవత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే చివరి ఆదివారం గ్రామాల్లో గ్రామదేవతలకు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించే ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా భక్తులు ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి గ్రామ దేవత పోలేరమ్మకు బోనాలు సమర్పించారు.



పుల్లలచెరువు లో పోలేరమ్మ దేవతకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు.

'ఉపాధి'పై వెల్లువెత్తిన ఆరోపణలు



ప్రజా వేదిక నిర్వహిస్తున్న పీడీ శీనారెడ్డి

కొనకనమిట్ల: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 2022–23లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉపాధి హామీ పనులపై డీఆర్పీల పర్యవేక్షణలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆమేరకు ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శీనారెడ్డి ఆధ్వర్యంలో సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో 866 పనులకుగాను రూ.14.15 కోట్ల వరకు నిధులు ఖర్చు చేశారు. అయితే పలు గ్రామాల్లో మొక్కలు లేకుండానే బిల్లులు డ్రా చేసినట్లు ప్రజా వేదికలో వెల్లడించారు. చేసిన పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు ఉన్నట్లు ప్రజా వేదిక దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో రైతుల వివరణ కోరగా మొక్కల బిల్లులు సక్రమంగా రాకపోవటంతో వాటిని దున్ని వేరే పంటలు సాగు చేసినట్లు సీఆర్‌పీలు ప్రజా వేదిక దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా వేదికలో వెల్లడించిన అంశాలపై పూర్తి స్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి జాన్సీరాణి, క్లస్టర్ ఏపీడీ పద్మశ్రీ, ఎస్ఆర్పీ సుబ్బారావు, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏపీఓలు బుల్లెన్న, రవిబాబు, ఈసీ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఎస్ఆర్‌పీలు, సీసీ, వీఏస్ఏలు పాల్గొన్నారు.

వేములకోట అభివృద్ధికి కృషి

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగ్రామంలో 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జంకె మాట్లాడుతూ.. జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో డ్రైనేజీలు, ఎంపీ ల్యాడ్స్ రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు జంకెను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రాజేశ్వరి, ఎంపిటిసి వీరయ్య, పార్టీ నాయకులు జంకె వెంకటనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, జానపాటి ఆవులయ్య, చాగంటి వెంకట నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, కోటిరెడ్డి, టి.రామిరెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణం నాణ్యతలో రాజీపడొద్దు

● రాష్ట్ర పంచాయితీరాజ్ సీఈ బాలునాయక్



సిబ్బందితో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ సీఈ బాలు నాయక్

మార్కాపురం రూరల్: నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ బి.బాలునాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని వేములకోట, తిప్పాయిపాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. త్వరితగతిన సచివాలయాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకునిరావాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయితీ రాజ్ ఈఈ వై.రమేష్‌బాబు, డీఈ కె.ఆదినారాయణ, ఏఈ విజయమోహన్‌రాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మల్లవరంలో నూతనంగా నిర్మించిన పలు భవనాలను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, లైబ్రరీ, బల్క్‌మిల్క్ సెంటర్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మార్కాపురం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్

● పలు ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు
● డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామని డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి పేర్కొన్నారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే డివిజన్‌లోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కీలకమైన ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 15 మందిని హౌస్ అరెస్టు చేశామని, 56 మందిని అదుపులోనికి తీసుకున్నామని, 40 మందికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. మార్కాపురం పట్టణంలో కోర్టు సెంటర్, కంభం సెంటర్, దోర్నాల సెంటర్‌తో పాటు ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దర్శి: మునగా కోటిరత్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునగా నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీజీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ మునగా అనీల్, ఇతర వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు టి.సుమన్, గీతా పద్మ, ఆశిష్, షమిల్, నీరజ్‌కుమార్, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం



108 కలశాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతి, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు.

స్నేహం.. 'అపూర్వ'ం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో అపూర్వంగా సాగింది. పూర్వ విద్యార్థుల్లో పలువురు ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు. ఆనాటి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులతో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. చదవు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు టీచర్లుగా, సాఫ్ట్‌వేర్, రెవెన్యూ ఉద్యోగులుగా జీవితంలో స్థిరపడటం అభినందనీయమని రిటైర్డు డీవైఈఓ సీహెచ్‌పీ వెంకటరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు టి.శ్రీనివాసులు, హెచ్‌ఎంలు సుధాకర్, కృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటిగంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు(ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారికి ఎనిమిది చీరలు సమర్పించారు. ఆలయానికి రూ.12,670 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ ఏబీ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావులు భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

దళితుల అభ్యున్నతికి ఎమ్మెల్యే సహకారం



మాట్లాడుతున్న చెన్నకేశవులు తదితరులు

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గంలో దళితుల అభ్యున్నతికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అందిస్తున్న సహకారం మరువలేమని వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీ సెల్ కార్యదర్శి దారా చెన్నకేశవులు, జిల్లా నాయకులు కూరాటి చెన్నకేశవులు, అంబటిపూడి రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొదటిసారిగా అంబేడ్కర్ భవన్‌ను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మంజూరు చేయించారని, ఇందు కోసం 50 లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను దళితులకు అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మార్కాపురం పట్టణంలో దళితులకు శ్మశాన స్థలం కేటాయించి హద్దులు చూపాలని తాము సబ్‌కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు.

యోగా టీచర్‌కు సన్మానం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అమ్మ ఆశ్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకుడు బీఎస్.నారాయణరెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ వారు మదర్ థెరిసా అవార్డుకు ఎంపిక చేసిన సందర్భంగా అమ్మ ఆశ్రమ నిర్వాహకురాలు తిరుపతమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగస్తుల సంఘ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, బీజేపీ నాయకులు రామాంజనేయులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.